


బాస్! బస్ బస్ బస్ బస్! చాలు. కొల్లలు కటిట్, తెగ్గొశివతలపారీయొచ్చు, రేయ్ బాయ్! నాలుక్కుర్చీ లవతల వెయ్యి. వారూ వీరూ కూచుంటారు. హబ్బ థెగ ఉడక పోసేస్తుంది గదండి సార్! గుడ్డిలో మెల్ల ప్రొడ్యూసరుగారి చూపుల వేడి కూడా లేదు, మన్లో మనమాట. అది కూడా ఉంటే ఈ హై పవర్ లైట్లకి తోడై నాలాటర్ఛకుల్ని మాడిచ్చంపేసును, పదండి సార్. ఒక్క నిముషం రెస్ట్ తీసుకుందాం, రెస్ట్ల ఫస్టన్నాడు ఎవరెస్ట్ హీరో టెన్సింగ్ నార్కే.

చూడండి కామెరామన్ గారూ, ఇపుడు తీసిన షాట్ అలాగే ఉంచండి, బహు జాగ్రత్త సుమండీ, సెటప్ మార్చికండేం. మరో షాటు కూడా సరదాగా తీద్దాం, టెన్ మినిట్స్ రెస్ట్.

బాయ్.... గారికి కాఫీ, నాక్కాస్త 'గట్రా' పట్రా. ష్ హమ్మయ్య. షమ్మయ్య. ఝువిటో సార్, మా రోవింగ్ డైరెక్టరుగారింకా నెక్స్ట్ షాటు ఎలా తియ్యాలో ఫోన్ చేయనే లేదు. నాకు ఎక్స్పీరియన్స్ లేక్కాదుస్మండీ. అయనేదో వెయ్యేళ్ళ పూజారిగా తీరికలేక టెలిఫోన్ మీచ్చెబుతూ ఉంటా, బాబ్బాబు కాస్త రెండు కాల్షీట్లు సాయంపట్టమని మోకాళ్ళా వేళ్ళా పడ్డాడు. ఉపకారాని కొచ్చినపుడు మనవేల హద్దు మీరాలి. మీగ్గాబట్టి ఇందులో కిటు కర్థమైంది.

యావంటారూ? ఇపుడు తీసిన షాట్ బాగుందా అనా? యంతమాట శలవిచ్చారూ, టెర్రిఫిక్‌గా అనగా భయంకరంగా వుంది. ఇంగ్లీషిడియం స్మండీ. ఆ నుడికారాన్ని తెలుగులో వెటకారంగా అర్థం చేసుకోగ్గలు జాగర్త. వెధవ దిదో చిక్కొచ్చిందండీ, ఈ ఇంగ్లీషుని మాస్టరు చేసిన వాళ్ళందరూ తెలుగు పూర్తిగా మర్చిపోవడం చాలా అవసరం, అంత వరకు మనం బాగుపడం. వెధవది ఓ భాషలో సొంపు రెండో దాంటో కంపు గదా! పెడర్థాలొస్తాయి. ఇవేవన్నా పిక్చరులో డైలాగులైతే ఫరవాలేదు. పెడర్థాలొస్తే సంతోషిస్తాం. అసలవి లేకపోతే మజాయే లేదు గదా! మనకి.... ప్రమాణకపూర్తిగా చెబుతున్నాను. మీరు అన్యథా భావించడం వల్లనో, కాఫీ బాగు లేనందు వల్లనో మొహం అదోలా పెడుతున్నారుగాని, మనసులోమాట చెబుతున్నాను. నాకసలు మాట దాచుకోవడం చేతగాదు. నిష్కర్షగా అనేస్తాను. అందికే ఇలా ఉండిపోయాననుకోండి, చెప్పొచ్చిం దిందాక షాటులో మీ యాక్టింగు బ్రహ్మాండంగా ఉంది. సరిపోతుందా అని మీరు సందేహపడ్డాగాని, కొల్లలు, రెండాటలకి సరిపడా ఉంది.

సార్, దిస్ పూర్ బాక్‌వర్డ్ కంట్రీ కాబట్టి మీరింకా ఇలా ఉండి పోయారు గాని నిజంగా నేనే ప్రొడ్యూసర్నయితే ఆ యాక్టింగుకి రెట్టింపు రేటిద్దును. మిమ్మల్ని యాభైవేలకి బుక్ చేస్తే మీరు లక్షరూపాయల యాక్టింగు చేసివతల పారేస్తున్నారు. మీ కొంకబెట్టింది

కా అష్టావక్రుడికూడా చేతనవదు. ఏవంటారు. నామాటబద్ధమైతే మీ హీరోయినుగార్నడగండి. లేపోతే మీ అప్తమిత్రుణ్ణి కనుక్కోండి. మీలో ఉన్న లోపఁవల్లా ఒహటే. నాలాగే మాడెస్టి మహలావు మీకూను. మరీ అంత వినయం తగదు. మీరు సెట్టుమీద కొచ్చాక యాభై అయిడియాలు కూడా ఇవ్వరు. మీకున్న అనుభవానికెన్ని చెయ్యొచ్చు .... వెధవది ఈ డైరెక్టరుగాడి న్నిల్దీసడిగితే ఒక్కొక్కడు పది పిక్చర్లకన్న తీసుండడు. మీరు వీళ్ళని పాతికెట్టి గుణించినన్ని పిక్చర్లలో వేశారు.

అసలు హాలీవుడ్‌లో అయితే మీలాటి యాక్టరు యేంచేద్దుడు తెల్సా? ఒహ కథ పట్టుకుని--కథ అంటే అంతా ఉండి తీరాలని గాదు మాటవరసకన్నాను--ఓ కథ పట్టుకుని ఓ డైరెక్టరుగాణ్ణి వెనకేసుకుని ఆవటా, "ఇదిగో ప్రొడ్యూసర్లూ నేనున్నాను; ఆ పైన ఓ కథుంది, ఇదిగో ఓ డైరెక్టరున్నాడు. కావలిస్తే మా చేత పిక్చరు తీయించుకోండి. కాండబ్బివ్వద్దు. రిలీజయ్యాక వసూళ్ళలో నూటికి నలభై నాకు, పదో పరకో డైరెక్టరికీ ఇవ్వండి" అంటారన్నమాట. హాలీవుడ్‌లో అలాగే చేస్తున్నారు బాక్సాఫీసు స్టార్లు.

మీ బలం వల్లనే పిక్చరు హిట్టవుతోంది. గాబట్టి, ఏ పాతికలక్షలో లాభాలొస్తే, పదిలక్షలు మీ వాటా. ఈ విధముగా చేసి హాలీవుడ్‌లో స్టీవర్టు గ్రేంజరుండును, అచ్చోటనే గారీ గ్రూపరుండును గోటీశ్వరులైరి, ఆ నోమే మీరూ నోమవచ్చు....

పిక్చరు దెబ్బతింటేనంటారా? .... తిన్నుగా!

అదీ సంగతి, అలాటి బేరం ఉండి, లక్షలకి లక్షలు కురుస్తున్నపుడు, ఇందాక మనం తీసినలాటి షాటులో మీరు నటించినదానికి మరి నాలుగురెట్లు చేసినా తప్పు కాదంటాను. ఈ లోగా అంథటి హైరానపడి - ప్రొడ్యూస రిక్కళ్ళేడు గద - మరీ ఇంతగా యాక్టింగు చెయ్యడం శుద్ధ దండుగ. క్రిమినల్ వేస్టు--ఓ క్రిమినల్లాయరన్నట్టు.

అంచేత ఇపుడోటి చేదాం: ఇందాక షాటు మళ్ళీ ఓసారి తీద్దాం. అందులో మీరు యాభైవేల యాక్టింగే చెయ్యండి. వీలైతే అందులో బ్లాకు మినహాయించగా మిగిలిందే చాలు, ఇదీ ఇదీ రేపు ప్రొడ్యూసరికి చూపించి అబ్బాయ్ చూసుకో తేడా, లక్షరూపాయలిస్తే ఈ ఎక్స్‌ట్రా యాక్టింగున్న షాటు తీసుకోవచ్చు. కాదా యిదుగో యాభైవేల రకం పుచ్చుకు సంతోషపడు అని నిష్కర్షగా చెప్పేస్తాను. ఈ గిరీశంగాడిలా అన్నట్టు మరెక్కడా

అనమోకండేం? కొంపలంటుకుంటాయి. అవన్నీ ఎక్స్ ప్రొడక్షన్స్ వాళ్ళు షూట్ చేసుకుని మన పిక్చర్ మీద పోటీకి వదలి దెబ్బతీయగల్రు.

అమ్మా! మీ విషయవూ౯ అంతే. మీ ముగ్గురివద్దా నాకు చనువుండి యటువంటి దాపరికవున్నూ లేకపోబట్టి ఇలా భయం విడిచి చెబుతున్నాను. మీరూ అంతే. హీరో వారితో కూడబలుక్కున్నట్టుగా, ఇప్పుడు చేస్తున్న దాంట్లో సగ౯వే యాక్టు చెయ్యండి. వీళ్ళ మొహాని కిది చాలు. మీదాకా వచ్చిందో లేదో గాని - ఇప్పుడే ప్రొడ్యూసరు గిలగిల తన్నుకుంటున్నాడు మీకెందుకో కోపం వచ్చిందని. మీరు పిక్చరుమీద ఏమీ యింటరెస్టు తీసుకోడం లేదుట. కథ ఎండింగు గురించి పేచీ పెట్టలేదుట. గ్లామర్ డ్రెస్‌తోటి డ్యూయెట్లు రెండు చాలవనీ, మూడుండాలనీ, ఓ సోలో సాంగు పిక్చరైజు చెయ్యాలనీ పంతం పట్టలేదుట. అల్ల వారి పిక్చర్లో ఇవన్నీ కావాలనిన్నీ, లేపోతే రాననిన్నీ కబురంపిన ఆవిడ, మనతో పేచీలు పెట్టదే౯వీ? అంటూ ఆ వెర్రి బ్రాహ్మడు - అహోరాత్రులూ ఒక్కలా మధనపడి పోతున్నాడు. ఇపుడు గనక మీరు యాక్టింగు కూడా తగ్గిస్తిరా దారి కొచ్చేస్తాడు.

బాయ్! షాట్ రెడీ అయితే అలా అరవద్దని చెప్పు ఆ కెమరామాన్‌తో, దీపాలు వెలిగిస్తూ ఉండమను. ఒకనిమిషంలో వచ్చేస్తున్నాం.

తరువాత, గురూజీ! మీతో కూడా ఒక్కమాట. ఈ మాటో తమాషా చేదామని ఉంది. మీరీ మాటాస్సెం జేసినపుడూ, మరీ ఆస్సెగాడిలా మొహం పెట్టకండి చెప్తా. పిక్చర్లో హాస్యానికీ, డైలాగులో విట్టుకీ మీకు నవ్వొచ్చిందన్న వైనం గుట్టుగా ఉంచేసి, ఏవ్‌హి యరగనట్టు యాక్టు చెయ్యండి. ఈసారి ఆడియన్సు జోక్ పట్టుకుంటారో లేదో, సొంతగా నవ్వగల్రో లేదో చూద్దాం. ఓ చిన్న పరీక్ష లాంటిదన్నమాట. దీన్ని గురించి పత్రికల్లో పబ్లిసిటీ యిప్పించొచ్చులెండి. సార్! మీరు కూడా హెల్పు చెయ్యాలీయనకి. ఈయన హాస్యగాడుగారని గాని, హాస్యంచేస్తున్నాడని గాని హీరోకి తెలిసినట్టు మీరు 'క్లూ' ఇవ్వద్దు. హీరో ఈ అస్సెగాడితో మాటాడినపుడు వీడో జడ్డివెధవ అన్నట్టు చూడకండి, వీణ్ణి ఉద్ధరిస్తున్నట్టు మాటాడకండి, అంథా సీక్రెట్ సుమండీ, జనవే౯ వంటారో చూద్దాం. అనక వెనకనించి పబ్లిసిటీ యివ్వచ్చు.

లాష్టు బట్‌నాట్ లీస్టు--విలన్‌జీ మీతో కూడా ఖుట్ర చెయ్యాలనుకుంటున్నాం సార్.... అబ్బ అలా చూడకండి. నాకే భయం వేస్తోంది. మీ గెటప్పూ, యక్సు ప్రెషను చూస్తే, చూడండీ ఇందాక షాట్‌లో విలన్ హీరోయిన్‌ని తీయకబుర్లతో మాయ జేసేదుంది చూడండి, అక్కడో ట్రిక్కు చేద్దాం. మీరావిణ్ణి మాయచేస్తున్నట్టు మా క్కూడా తెలియనివ్వకుండా చెయ్యండి, అంటే ఆడియన్సు కన్న మాట. ఆవిడ కెలాగా తెలీదుగా. ఝివిటో ఇలా జోకులు పడిపోతుంటాయి--మరేం లేదు. ఇందాక చేసింది బ్రహ్మాండంగా ఉంది. ఎటొచ్చీ, అందులో నేను విలన్నిస్మీ అని క్లూ ఇచ్చే ఎక్స్‌ప్రెషన్‌లు రెండూ తీసేద్దాం. యవడు హీరోవో, యవడు కాడో జనాని కంతుపట్టకూడ దన్నమాట.

అంతకుముందర షాట్‌లలో మీరు దుష్టులని ఎష్టాబ్లిషు చేసే సీనులు రెండున్నాయిగా. అవే ఆధారాలన్న మాట జనానికి. ఒక వేళ ఆ సీనులు తీసేస్తే, మీ రిందాకా చేసిన యాక్టింగుని మహారాజులా ఉంచుకోవచ్చు. సజెషన్‌లో పులితల కూడా తీసేదాం. బాగ్రౌండ్‌లో నాగిన్ మ్యూజికూ తీసేద్దాం. నన్నడిగితే మనవైదుగురూ కూడబలుక్కుని పై జెప్పిన ప్రకారం చేసినట్టాయనా--త్రిల్లింగ్‌గా ఉంటుంది. జనాన్ని షాకు చేసవతల పారెయ్యొచ్చు. వెనకనించి పబ్లిసిటీ ఇప్పిద్దామనుకోండి "ఎ ఫిలిం విత్ గ్రేటెస్ట్ ట్రిక్స్ ఆఫ్టర్ హూడినీ" అఁవటాని. మీ ఇష్టంస్మండీ. డైరెక్టరుక్కూడా మనం చెప్పొద్దు. టెలిఫోన్ యండ్ రోవింగ్ డైరెక్షనే గదా, నాల్రోజులు పోయాక నేనే బుకాయించి పారేస్తా, "బ్రదర్! అక్షరాలా నువ్వు ఫోనులో చెప్పిన అయిడియా వే స్మి" అని.

ఇంకో రహస్యం, ఇది మహా రహస్యం. నేను కవిగారితో కూడా కుట్రచేసేను. పాపం వాళ్ళూహళ్లండీ, డవున్ ట్రాడెన్ పీపుల్.... రాసిందే రాసినట్టే రాయలేక అవస్థ పడుతున్నారు పాపం. అక్కడికీ వెరైటీ కోసవని ఇంటి కెవరొస్తే వాళ్ళ చేతో సీను రాయించి - మళయాళీ వచ్చినా సరే ఏదోవోటి అఘోరించమని ఆ తరువాద్దాన్ని తర్జుమాయించి-- ఇస్తున్నారు. మన కవిగారు మంచివాడు, ఎక్స్ ఫిలింస్ వాళ్ళ కథలో ఓ సీను మహాబావుందంటే మనక్కూడా రాసిచ్చాడది .... మందాంట్లోనే ముందరొచ్చేస్తుందనుకోండి, మర్చిపోయి రాసినా ఇంతేగద. కానదోషం లవలేశం లేదు.

ఆయా దయచేయండి, దయచేయండి. మీ మాటే అనుకుంటున్నది, మరో వెయ్యి పిక్చర్లాయుష్మ, శత పిక్చ ప్రాప్తిరస్తు. హాలీవుడ్‌లో మీవంటివారుంటే ఎన్ని లక్షలొచ్చేదో, అందుమీద యంత టాక్సు పోయేదోగదా అని వాపోతున్నాం. అంతేగదండీ అక్కడ ఒక నాటకానికి లక్షలిస్తారు. ఓ పిక్చర్‌కి అంతకి పై బడిస్తారు.

మీరంతా చవగ్గా రాయడం మప్పారుగాని, నిజానికి నన్నడిగితే మీ రైటర్లంతా ఒక యూనియన్ పెట్టుకోవాలి సార్. యూనిటీ ఉండి తీరాలని కాదు. పోట్లాడ్డానికైనా - మరేవ్వీ కాదు. మాగ్గనక రేట్లు పెరగకపోతే, ప్రాచీన తెలుగు సినిమా కథని రూపురేఖలు తెలీకుండా పరిమార్చవతల పారేస్తామని బెదిరిస్తే సరి. హోల్ ఇండస్ట్రీ అంతా మీ కాళ్ళ మీద పడుతుంది. మీరు తెలుగు జీవితంతో కొత్తరకం కథలూ, డైలాగులూ రాసిపారేస్తే నటులకు నటన కష్టం. డైరెక్టర్లకు డైరెక్షన్ కష్టం. వెయ్యేల అందరికీ అన్నీ కష్టం. ఎందుకంటే అంతా కొత్త గదూ. ఒక్క చూసేవాడికి తప్ప. వాడి కిదేవి టదేవి టేదైనా చూసేస్తాడు. వాడి సొమ్మేం పోయె పావలా అర్ధణా తప్ప.

సంప్రదాయానికీ సెంటిమెంటుకీ అది వెతిరేకం అని మీరలా భయపడడం తగదు. భద్రాద్రిరాముడికే దిక్కు లేదు.

